పచ్చని ఎవుసంపై కాంగ్రెస్ కడుపు మంట

సాగుకు 3 గంటల కరెంట్ చాలట!

మొదట్లో మూడు గంటల కరెంట్ చాలన్న రేవంత్
రైతుల్లో వ్యతిరేకతతో మరో తప్పుడు వాదన
10 హెచ్‌పీ మోటర్లు వాడాలంటూ హితవు
వ్యవసాయంలో ఎంత సామర్థ్యం మోటర్లో తెలువని వైనం
చిన్న, సన్నకారు రైతులపై భారం మోపే కుట్ర
ఒక్కో 10హెచ్‌పీ మోటర్‌కు అదనంగా రూ.లక్ష ఖర్చు
జిల్లా రైతులపై రూ. 350 కోట్లకు పైగా అదనపు భారం
పీసీసీ అధ్యక్షుడు రేవంత్ వ్యాఖ్యలపై రైతన్నల మండిపాటు

యాదాద్రి భువనగిరి, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై రైతాంగం అగ్గిమీద గుగ్గిలం అవుతున్నది. వ్యవసాయానికి 3 గంటల కరెంట్ చాలని చేసిన అడ్డగోలు వాగుడుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. అంతటితో ఆగకుండా 10 హెచ్‌పీ మోటర్లతో నీళ్లు పారించవచ్చంటూ ఇచ్చిన ఉచిత సలహాలపై దుమ్మెత్తిపోస్తున్నది. తెలంగాణ రైతులను ఆగం చేసేందుకు రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నాడని మండిపడుతున్నది. 3 గంటల కరెంట్ ఎలా చాలంటారని ప్రశ్నిస్తున్నది. చిన్న, సన్నకారు రైతులు 10 హెచ్‌పీ మోటర్ల భారం ఎట్ల భరిస్తరని నిలదీస్తున్నది. పైపులు, క్లాంపులు, వైర్లు, డబ్బా, స్టార్టర్లకు పైసలెవరు పెడ్తరని అడుగుతున్నది. ఒక్కో మోటర్‌కు అదనంగా రూ.లక్షకు పైగా ఖర్చు ఏడ తేవాలని నిగ్గదీస్తున్నది. అంతేకాకుండా మోటర్లన్నీ ఒకేసారి ఆన్ చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు పేలే ప్రమాదం ఉందని, ఈ ఆలోచన మూర్ఖత్వంతో కూడినదని విశ్రాంత విద్యుత్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

జిల్లా రైతులపై రూ.350 కోట్ల పైనే అదనపు భారం

10హెచ్‌పీ మోటర్ల ద్వారా నీళ్లు అందించవచ్చని సోయి లేకుండా రేవంత్‌రెడ్డి అంటున్నాడు. అసలు 10హెచ్‌పీ మోటర్లు రైతుల ఎందుకు ఉపయోగిస్తారు..? రైతుల ఉపయోగించేవి 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లు అని తెలియదా..? అనే కనీసం పరిజ్ఞానం కూడా రేవంత్‌రెడ్డికి లేదు. కొత్తగా 10 హెచ్‌పీ మోటర్ కొనాలంటే చిన్న, సన్నకారు రైతులు రూ.50వేలు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. దాంతోపాటు పైపులు, క్లాంపులు, వైర్లు, డబ్బా, స్టార్టర్లకు మరో రూ.50 వేలకు పైనే భారం పడుతుంది. ఒక వేళ బోరు లోతు ఎక్కువగా ఉంటే.. ఆ స్థాయిలో పైపులు, వైర్లకు ఖర్చు పెరుగుతుంది. ఇలా ఒక్కో రైతుపై సగటున రూ.లక్షకు పైగా అదనపు ఖర్చు పడుతుంది. జిల్లాలో సుమారు 3.20 లక్షల మంది రైతులు ఉన్నారు. అంటే దాదాపు 3.50 లక్షలకు పైనే మోటర్లు నడుస్తున్నాయి. అంటే జిల్లా రైతులు సుమారు రూ.350 కోట్లకు పైగా అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది.

మోటర్లు పేలే ప్రమాదం..

సాధారణంగా 3 హెచ్‌పీ మోటర్ కంటే 10 హెచ్‌పీ మోటర్ ఎక్కువ కరెంట్ వినియోగిస్తుంది. రేవంత్‌రెడ్డి చెప్పే.. 3 గంటల సమయంలో అందరూ ఏకకాలంలో మోటర్లు ఆన్ చేస్తే భారీ లోడ్ పడుతుంది. ఇదే విషయాన్ని విద్యుత్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అంతేకాకుండా లోడ్ ఎక్కువై ట్రాన్స్‌ఫార్మర్లు పేలే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇక 10హెచ్‌పీ మోటర్ బిగిస్తే పది నిమిషాల్లోనే ఊటనంతా బయటకు లాగుతుంది. సాధారణంగా 3 హెచ్‌పీ మోటర్ పెడితే.. నిర్విరామంగా ఒకేధారలో నీళ్లను పోస్తుంది. పొలాలు మంచిగా తడుస్తాయి. కానీ, 10హెచ్‌పీ మోటర్లతో ఈ పరిస్థితి ఉండదు. భూగర్భజలాలు సైతం త్వరగా ఇంకిపోయే ప్రమాదం లేకపోలేదు.

మళ్లీ అప్పటి కష్టాలు పడలేం..

తెలంగాణ వచ్చినంక మా బతుకులు బాగు పడుతున్నయ్. పుష్కలంగా సాగు నీళ్లు, కరెంట్ సరఫరా ఉంది. ఐదారు ఎకరాల పొలం పారుతుంది. పదేండ్ల కింద కాంగ్రెసోళ్లు 7 గంటల కరెంట్ ఇస్తే ఎకరం పారలేదు. పొద్దస్తమానం కరెంట్ కోసం మోటర్ దగ్గరే పడిగాపులు కాసేటోళ్లం. అర్ధరాత్రి బాయికాడికి పోవాల్సి వచ్చేది. కరెంటు ఎప్పుడు వస్తదో, ఎప్పుడు పోతదో తెలియని దుస్థితి ఉండేది. గంటలో నాలుగు సార్లు పోయేది. మళ్లీ ఇప్పుడు 3 గంటల కరెంటు సరిపోదని రేవంత్‌రెడ్డి మాట్లాడడం సరికాదు. ఆయనకు వ్యవసాయంపై అవగాహన లేదు. ఇప్పుడు సీఎం కేసీఆర్ పుణ్యమా అని పొద్దున మోటర్ ఆన్ చేస్తే మళ్లీ రేపు వచ్చి బంద్ చేసుకుంటున్నం. ఎకరానికి ఏడాదికి రూ.10 వేల రైతుబంధు, రైతుబీమా, సాగునీళ్లు, కరెంట్ ఇస్తున్న కేసీఆర్‌ను కాదని, సీఎం కుర్చీ కోసం కాంగ్రెస్‌లో చేరి చేతగానీ మాటలు చెబితే వినేది లేదు. కాంగ్రెసోళ్ల మాటలు వింటే మా బతుకులను మేమే ఆగం చేసుకున్నట్లు. రైతుల మేలు ఎరిగి సాగునీళ్లు, 24గంటల కరెంట్‌తోపాటు పండిన పంటకు మద్దతు బాటు ధర ఇస్తున్న కేసీఆర్ సర్కార్‌కు రైతులమంతా మద్దతిస్తాం. అంతేకానీ టికెట్లు అమ్ముకున్న రేవంత్ రెడ్డి మాటలు నమ్మలేం. **– జంగ సుధాకర్, రైతు, మోత్కూరు**

జవాబు లేని ప్రశ్నలెన్నో..!

వ్యవసాయానికి 3 గంటల కరెంట్ సరిపోతుందని రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో వ్యాఖ్యానిస్తూ వచ్చారు. కర్ణాటకలో 5 గంటలే ఇస్తున్నామని, అది కూడా అవసరం లేదని, 3 గంటలే చాలంటూ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడు. అయితే 24 గంటల సమయంలో 3 గంటలు ఎప్పుడిస్తరనేది ప్రశ్నార్థకంగా మారింది. ఉదయం ఇస్తరా..? రాత్రిపూట ఇస్తరా..? ఉదయం గంటన్నర..? రాత్రి గంటన్నర ఇస్తరా..? అనేది జవాబులు లేని ప్రశ్నలు. ఒక వేళ పగటపూట బంద్ చేసి.. రాత్రి ఇస్తే రైతులు పరిస్థితి ఏంటి? అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ఇదే పరిస్థితి తెలంగాణ రాక ముందు ఉమ్మడి రాష్ట్రంలో రైతులు అనుభవించారు. అప్పుడు రోజుకు కనీసం 3 లేదా 4 గంటల కరెంటు కూడా రాకపోయేది. దాంతో పంటలు ఎండిపోయి రైతులు విపరీతంగా నష్టపోయేవారు. వచ్చే కరెంటు కూడా లోఓల్టేజీది కావడంతో మోటర్లు కాలిపోయేవి. ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయేవి. వాటి మరమ్మతుల కోసం రైతులు తిరిగి ఖర్చులు పెట్టుకోవాల్సి వచ్చేది. వచ్చే నాలుగైదు గంటలు కూడా ఎప్పుడొస్తుందో తెలియకపోయేది. దాంతో రైతులు రాత్రిపూట బోరుబావుల దగ్గరే నిద్రించేవారు. ఈ క్రమంలో వందలు, వేలాది మంది రైతులు కరెంట్ షాక్, పాము, తేలు కాట్లకు గురై మృత్యువాత పడ్డారు. 3 గంటల కరెంట్‌తో మళ్లీ ఇలాంటి దుర్భర పరిస్థితులు ఎదుర్కొనే ప్రమాదం లేకపోలేదు.

వ్యవసాయానికి 10హెచ్‌పీ మోటరు వాడలేం

వ్యవసాయానికి 3గంటల కరెంటు సరిపోదంటున్న రేవంత్‌రెడ్డికి వ్యవసాయంపై అవగాహన లేదు. అంతేకాకుండా 10హెచ్‌పీ మోటర్లు వాడాలనడం సరికాదు. నాకు ఉన్న మూడెకరాల పొలానికి 3హెచ్‌పీ మోటరే వాడుతున్నా. నేనే కాదు మా ప్రాంతంలో ఎవరూ కూడా 10హెచ్‌పీ మోటరు వాడటం లేదు. బోర్లతో వ్యవసాయం చేసేవాళ్లు ఎవరు కూడా వ్యవసాయానికి 10హెచ్‌పీ మోటరు వాడరు. కాల్వల కింద సాగు చేసేవాళ్లే కొంతమంది వాడుతారు. దీనికి కరెంటు ఖర్చు కూడా ఎక్కువ అవుతుంది. అంతేకాకుండా భూగర్భంలో ఉన్న నీటిని మొత్తం లాగేస్తుంది. దాంతో బోర్లు వట్టిపోయే ప్రమాదం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్లపై లోడు పడి పేలిపోయే ప్రమాదం ఉంది. ఇప్పుడు వస్తున్న కరెంటుతో పంటలు బాగా పండుతున్నాయి. మళ్లీ వెనుకటి రోజులను తీసుకురావద్దు.
–పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మందళ్ల గూడెం, చౌటుప్పల్ రూరల్

గతంలో లోఓల్టేజీతో మోటర్లు రిపేరుకు వచ్చేవి

గతంలో కరెంటు సరఫరాలో హెచ్చుతగ్గులు ఉండేవి. ప్రతి రోజూ రైతుల మోటర్లు కాలిపోతుండేవి. దాంతో మెకానిక్‌లకు చేతినిండా పని ఉండేది. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతున్నది. దాంతో మోటర్లు కాలిపోవడం లేదు. సాధారణంగా రైతులకు 3హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటర్లు మాత్రమే ఉండేవి. వీటితోనే పొలాలను పూర్తిస్థాయిలో పారించుకునేటోళ్లు. 10హెచ్‌పీ మోటర్లు ఎక్కడా లేకుండే. 3 హెచ్‌పీ మోటర్‌కు రూ.18వేలు, 5హెచ్‌పీ మోటర్‌కు రూ.25వేల వరకు ఉండేది. అదే 10హెచ్‌పీ మోటర్‌కు రూ.45వేల వరకు ఉంటుంది. రైతులు ఎవరూ 10 హెచ్‌పీ మోటర్లను ఉపయోగించేవారు కాదు. 10హెచ్‌పీ మోటర్లు వాడితే రైతుల బోర్లలో జలాలు వట్టిపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందింస్తుండటంతోపాటుగా భూగర్భజలాలు పుష్కలంగా ఉన్నాయి. రేవంత్‌రెడ్డి 10హెచ్‌పీ మోటర్లు పెట్టాలనడం సరికాదు. ఆయనకు వ్యవసాయంపై అవగాహన లేకనే అలా మాట్లాడుతుండు.
–మన్యం గోపేందర్, మోటర్ వైండింగ్ మెకానిక్, భువనగిరి

కేసీఆర్‌తోనే రైతులకు నాణ్యమైన కరెంటు

కాంగ్రెస్ హయాంలో కరెంటు ఎప్పుడు వచ్చేదో, ఎప్పుడు పోయేదో తెలిసేది కాదు. రైతులకు తీవ్రమైన సమస్యలు ఎదురయ్యాయి. ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల పక్షపాతిగా నిలిచారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందుతున్నది. విద్యుత్ సరఫరాలో తెలంగాణను మించిన రాష్ట్రం లేదు. రేవంత్‌రెడ్డి 3 గంటల కరెంటు సరిపోతదనడం కరెక్ట్ కాదు. ఎక్కడైనా వ్యవసాయబావులకు 3హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటర్లనే వినియోగిస్తారు, ఎక్కడ కూడా 10హెచ్‌పీ మోటర్లను వినియోగించరు. మా గ్రామంలో 500పైగానే 5హెచ్‌పీ మోటర్లు ఉన్నాయి. 10హెచ్‌పీ మోటర్లతో భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం ఉంటుంది. అంతేకాకుండా ట్రాన్స్‌ఫార్మర్లు పేలే అవకాశం ఉంటుంది
–ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి, రైతు, హుస్సేనాబాద్, భువనగిరి

3గంటల కరెంటు రేవంత్ అవివేకానికి నిదర్శనం

కాంగ్రెస్ పాలనలో వ్యవసాయానికి కరెంటు సరిగా లేక రైతులం తీవ్ర ఇబ్బందులకు గురయ్యాం. కరెంటు కోసం వ్యవసాయ బావులు, బోర్ల వద్ద పడిగాపులు పడ్డాం. రాత్రివేళ విష సర్పాల కాటుకు గురై ఎంతోమంది రైతులు మృత్యువాత పడ్డారు. అలాంటి రోజులను మళ్లీ గుర్తుచేసేలా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి 3 గంటల కరెంటు చాలనడం ఆయన అవివేకానికి నిదర్శనం. ఆయనకు వ్యవసాయంపై అవగాహన లేకనే అలా మాట్లాడుతున్నాడు. నేడు తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న నాణ్యమైన ఉచిత కరెంటుతో రైతులంతా సంతోషంగా ఉన్నారు. రైతు సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టారు. రైతులను ఆదుకున్న ఘనత ఆయనకే దక్కింది. అలాంటిది కాదని మళ్లీ పాతరోజులను తలపించేలా 3గంటల కరెంటు చాలనడం సరికాదు.
–నోముల మాధవరెడ్డి, ఇంద్రియాల, భూదాన్‌పోచంపల్లి

పొలంకాడ పడుకునే రోజులు మళ్లీ వద్దు

నాకు ఐదెకరాల భూమి ఉన్నది. తొమ్మిదేండ్ల కింద కరెంట్ సరిగా రాకపోతే మోటరు పెట్టేందుకు పొలం దగ్గరే పడుకొని అర్ధగంటకు ఒకసారి లేచి చూసేటోన్ని. రోజు మొత్తం పొలం కాడనే పడిగాపులు కాసేటోన్ని. లో వోల్టేజీ కరెంట్ మూలంగా మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండేది. కష్టపడి పండించిన పంట పైసలన్నీ మోటర్లను బాగు చేయడానికి పెట్టేది. అప్పటి రోజులు మళ్లీ రావద్దని దేవుడిని మొక్కుకున్నా. దేవుడి రూపంలో సీఎం కేసీఆర్ సార్ రైతుల మేలుకోరి 24గంటలు ఫ్రీగా ఇస్తుంటే.. కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంటు సరిపోతుందని చెప్తుండ్రు. మూడు గంటల కరెంటుతో మూడెకరాల పొలం కూడా పారదు. తెలంగాణ ప్రభుత్వంలో కరెంటు బాధలు తప్పినయి. 24గంటల కరెంటుతో రెండు పంటలు పండిస్తున్నాం. రాత్రిళ్లు పొలానికి పోయే తిప్పలు తప్పినయి. ప్రభుత్వం చేస్తున్న పనులను ఓర్వలేక కాంగ్రెసోళ్లు ఇలాంటి కుట్రలు చేస్తున్నారు. రైతుల జోలికి వస్తే ఊరుకోం. మాకు నిరంతర కరెంటు ఇస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వమే కావాలి.
– సింగం నర్సింహ, రైతు, పులిపలుపుల, మునుగోడు మండలం